JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 24-12-2025
Medchal - Malkajgiri | Wednesday 24-12-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 208 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 208 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## మెస్సీ టూర్ లో 100 కోట్లా..? రంగంలోకి ఈడీ



జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 23:

అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి ఇటీవల తన గోట్ టూర్ భాగంగా ఇండియాకు వచ్చాడు. ఈ క్రమంలో కోల్ కతా లో ముందుగా పర్యటించాడు. అక్కడి సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల 22 నిమిషాల్లోనే మైదానం నుంచి వెళ్లిపోయాడు.. హైదరాబాదులో అతని టూర్ సజావుగానే సాగింది. ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్బాల్ ఆడాడు. దీంతో సందడి వాతావరణం ఏర్పడింది. ముంబైలో కూడా నిర్వహించిన గోట్ టూర్లో సచిన్ నుంచి మొదలుపెడితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వరకు

...మిగతాది 2 లో



## స్పష్టమైన విధివిధానాలతో ముందుకెళ్తున్నాం

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో తెలంగాణను కోర్-అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ ప్రాంతాల వారిగా సమగ్రమైన అభివృద్ధికి అన్ని విభాగాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

జయభేరి, హైదరాబాద్ :

విజన్ డాక్యుమెంట్ కేవలం ప్రచారానికి పరిమితమనే అపోహను తిప్పికొట్టేలా, ప్రతి అంశంపై లక్ష్యాలను చేరుకోవడానికి ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తే తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు, సీఎంఓ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమై దాదాపు 3 గంటలకుపైగా సమీక్షించారు. రానున్న రోజుల్లో

...మిగతాది 2 లో

ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ పాలసీలు లేవని అన్నారు. అందువల్ల అనేక సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యమైన విభాగాలకు పాలసీలు తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని అన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం తెలిపారు.

## మేము పరారీలో ఉన్న నేరస్థులం

- కేంద్రాన్ని ఎగతాళి చేస్తూ లలిత్ మోదీ, విజయ్ మాల్యా వీడియో
- బ్యాంకులను మోసం చేసి పారిపోయిన విజయ్ మాల్యా
- ఐపీఎల్‌లో అవకతవకలకు పాల్పడిన లలిత్ మోదీ
- మనీల్యాండరింగ్ సహా సీబీఐ, ఈడీ పలు కేసులు



జయభేరి, న్యూఢిల్లీ:

ఆర్థిక నేరగాళ్లు లలిత్ మోదీ, విజయ్ మాల్యాలు విదేశాలకు పారిపోయి దర్జాగా అక్కడ తిరుగుతున్నారు. తాజాగా, తాము 'భారత్ నుంచి పారిపోయిన అతిపెద్ద నేరస్థులం' అని చెప్పుకుంటూ వారు ఓ వీడియో షేర్ చేయడంతో సోషల్ మీడియాలో దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వీరిని స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రతిపక్షాలకు కొత్త ఆయుధంగా మారింది. ఆర్థిక అవకతవకలు, బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన లలిత్ మోదీ, విజయ్ మాల్యాలు అక్కడ దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా, ఈ ఇద్దరూ కలిసి తాము 'భారత్ నుంచి పారిపోయిన అతిపెద్ద నేరస్థులం' అని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు. దీంతో ఇది సోషల్ మీడియాలో వైరల్ కాగా.. కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లలిత్ మోదీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోను పోస్ట్ చేస్తూ ''నేను మళ్లీ ఇంటర్‌నెట్‌ను షేక్ చేయడానికి ఏదైనా చేస్తాను. మీకోసం ఇది. అసూయతో మీ గుండెలు మండిపోనివ్వండి' అని క్యాప్షన్ పెట్టారు. ఈ వీడియోలో, లలిత్ మోదీ, విజయ్ మాల్యా పక్కపక్కనే ఉండి 'భారతదేశానికి చెందిన మేము ఇద్దరం పరారీలో ఉన్న నేరస్థులం' అని చెప్పడం స్పష్టంగా వినిపిస్తోంది. ఈ వీడియోపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. 'వీళ్లు భారత ప్రభుత్వాన్ని ఎంత ఎగతాళి చేస్తున్నారో చూడండి' అని ఒకరు.. 'నువ్వు ఇంటర్నెట్‌ను బద్దలు కొట్టలేవు.. చప్పుడు చేయకుండా కూర్చో'

...మిగతాది 2 లో

## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్ ఈ నెల 31 వరకే



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 23 :

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 202526 విద్యా సంవత్సరానికి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలకు మొత్తం 9,79,506 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజులు చెల్లించినట్లు పేర్కొంది. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటికే వరకు ఫీజు చెల్లించకపోతే..

...మిగతాది 2 లో

## క్వాంటం రంగంలో ఏపీది లీడ్ రోల్



- ఏపీలో క్వాంటం స్కిల్ రోడ్ మ్యాప్ సిద్ధం
- రెండేళ్లల్లో అమరావతి నుంచే క్వాంటం పరికరాల ఉత్పత్తి
- క్వాంటం విజన్ ను, విప్లవాన్ని అందిపుచ్చుకోండి
- క్వాంటం టెక్నాలజీతో నోబెల్ స్థాయికి మన పరిశోధనలు చేరాలి
- "క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్" కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లెక్చర్
- క్వాంటం ప్రోగ్రామ్ లో వివిధ అంశాలను ప్రజెంటేషన్ ద్వారా టెక్ విద్యార్థులకు వివరించిన సీఎం చంద్రబాబు

జయభేరి, అమరావతి, డిసెంబరు 23:

భారత్ దేశంలో క్వాంటం టెక్నాలజీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం సహా దాని అనుబంధ రంగాల్లో నిపుణులను తయారు చేసేలా తాము కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఏపీ ప్రభుత్వం, వైసర్, క్యూబిట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న క్వాంటం ప్రోగ్రామ్ లో భాగంగా వేల మంది టెక్ విద్యార్థులతో ముఖ్యమంత్రి క్వాంటం టాక్ బై సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి నిర్వహిస్తున్న అతిపెద్ద శిక్షణా కార్యక్రమంలో డిజిటల్ మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇచ్చిన విజన్ ను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ క్వాంటం టాక్ బై సీబీఎన్ కార్యక్రమానికి క్వాంటం ప్రోగ్రామ్ కు రిజిస్ట్రేషన్ చేసుకున్న వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అమెరికా నుంచి వైసర్ సంస్థ ప్రతినిధులు, క్యూబిట్, ఐబీఎం సంస్థల ప్రతినిధులతో పాటు ఆంధ్రా యూనివర్సిటీ సహా వేర్వేరు ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు. క్వాంటం మెకానిక్స్, అల్గారిథమ్స్ లాంటి అంశాల్లో 10 లక్షల మంది నిపుణుల్ని, క్వాంటం సాఫ్ట్వేర్, హార్డ్వేర్ రంగాల్లో 3 లక్షల మందిని, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ లో 1 లక్ష మంది నిపుణుల్ని తయారు చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు.

...మిగతాది 2 లో

## ఒక్క క్లిక్ తో రైతుల సమస్యలకు పరిష్కారం



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 23:

రాష్ట్రంలో భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రెవెన్యూ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువస్తూ, వాటిని భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఆధునీకరించిన

...మిగతాది 2 లో

## ట్రెండింగ్ లో సేవ్ ఆరావళి

...మిగతాది 2 లో

## తప్పుడు కేసులకు భయపడేది లేదు

- పదోన్నతుల కోసం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు
- చట్ట ప్రకారం నడుచుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది.. హరీశ్‌రావు ఫైర్



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 23:

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సందర్భంలో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి మెప్పు కోసం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్న అధికారుల పేర్లను తాము ప్రత్యేకంగా నోట్ చేసుకుంటున్నామని ఆయన హెచ్చరించారు. ఏపీలో అక్రమాలకు పాల్పడిన అధికారులకు ప్రస్తుతం పట్టిన గతే ఇక్కడి అధికారులకు కూడా పడుతుందని, రిటైర్ అయినా లేదా విదేశాలకు వెళ్లినా వదిలిపెట్టకుండా చట్టం ముందు నిలబెడతామని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసెంబ్లీ సమావేశాల తర్వాత నోటీసులు ఇస్తారని ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ కామెంట్స్ చేశారు. కేసీఆర్ ప్రెస్ మీట్ తర్వాత రేవంత్ సర్కార్ పూర్తిగా రక్షణలో పడిందని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రి రాత్రి వేళల్లో చిట్‌చాట్లు పెట్టి వివరణ ఇచ్చుకోవడం తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి అందాల పోటీలు, ఫుట్ బాల్ షోకులు, గ్లోబల్ సమ్మిట్‌లతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. ఓయూకు ఒంటరిగా వస్తానని చెప్పిన సీఎం, వేలాది మంది పోలీసుల పహారాలో, విద్యార్థి నేతలను అరెస్టు చేయించి వెళ్లడం ఆయన పిరికితనానికి

...మిగతాది 2 లో

# అభివృద్ధి చేయండి నిధులు ఇస్తాం..

- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- సర్పంచ్‌లు ప్రజా పాలనలో భాగస్వామ్యం కండి : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- పార్టీల అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, డిసెంబర్ 23:**

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పాలన సాగుతుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం ఆలేరు నియోజకవర్గ స్థాయి నూతనంగా గెలిచిన కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల, ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులకు సన్మాన అభినందన సభను యాదగిరిగుట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఎస్సి,ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, రాష్ట్ర మహిళా సహకార సంస్థ ఛైర్మన్ బండ్రు శోభారాణి, నూతన సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి యాదగిరి గుట్ట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

అనంతరం జరిగిన సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించకుండా దీనస్థితిలోకి తీసుకెళ్లి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఉపఎన్నికలు, గ్రామపంచాయతీ ఎన్నికలతో బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడంతో రెండు సంవత్సరాలుగా ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్ పార్టీ మనుగడ కష్టమని, అందుకే బయటకు వచ్చాడన్నారు. బీర్ల అయిలయ్య నాయకత్వంలో ఆలేరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు అత్యధికంగా గెలవడం ప్రజాపాలనకు నిదర్శనమని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



**గ్రామ సర్పంచ్‌లు ప్రజా పాలనలో భాగస్వామ్యం కండి**

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి,ప్రజా పాలనలో గ్రామ సర్పంచ్‌లు ముందుండి పనిచేయాలని,అప్పుడే నాయకుడిగా ప్రజలు గుర్తిస్తారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నిరంతరం గ్రామాలలో ప్రజాసమస్యలపై సర్పంచ్‌లు స్పందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజాపాలనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాలాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు.

**పార్టీల అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం**

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ప్రజా పాలనలో పార్టీల అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి ఏ పార్టీ పోటీ లేదని, గ్రామాలలో కాంగ్రెస్‌కు కాంగ్రెస్ మధ్యే పోటీ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన ఆలేరు నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లకు నిధులు కేటాయించకుండా దుర్మార్గమైన పాలన అందించారని విమర్శించారు. సంక్రాంతి తర్వాత గ్రామాలాభివృద్ధికి నిధులు కేటాయిస్తామని,కొత్త పెన్షన్లతో పాటు పెన్షన్ల పెంపు జరుగుతుందని, మార్చి తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి శ్రమించిన వారిని పార్టీ గుర్తిస్తుందని,ఓడిపోయిన అభ్యర్థులకు అవకాశం ఉన్న దగ్గర నామినేటెడ్ పోస్టులు, ఎంపీటీసీ,జెడ్పీటీసీ టికెట్లు ఇస్తామన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాసంక్షేమ పథకాలు అందిస్తున్నామని,రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు ప్రవేశపెడతామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి నిత్యం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐన్యాల చైతన్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ నేతలు పోత్నక్ ప్రమోద్ కుమార్, బీర్ల శంకర్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, చీర శ్రీశైలం, కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతి, ఈరసరపు యాదగిరిగౌడ్‌తో పాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, నేతలు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

**శ్రీవారి సేవలో మంత్రి..**


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టి,శిశు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,రాష్ట్ర మహిళా సహకార సంస్థ ఛైర్మన్ బండ్రు శోభరాణీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి, ఎమ్మెల్యే, సంస్థ ఛైర్మన్ కు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఈవో వెంకట్రావు స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

# కొత్త సర్పంచులు.. కొన్ని ఆశలు

**జయభేరి, పరకాల /నడికూడా :**




కొత్త సర్పంచ్ లపై ఆయా గ్రామాల ప్రజలకు కొన్ని ఆశలు నెలకొన్నాయి. గాడి తప్పిన గ్రామ పంచాయతీల పాలనను సుపరిపాలన దిశగా నడిపించాలనే ఆశ ప్రజల్లో నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం గత 22 నెలలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించలేదు నాటినుండి ఇటీవల గ్రామ పంచాయతీల పాలకవర్గం కొలువుదీరేవరకు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగాయి. దాని మూలంగా గ్రామ పంచాయతీల పరిధిలో అభివృద్ధి అడుగంటిపోయిందని స్థానిక సమస్యలను ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న పాపాన పోలేదన్న అపవాదు నెలకొంది. ఇటు తెలంగాణ ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు పైసా ఇవ్వకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని ప్రజలు అనుకుంటున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన హెచ్చరిక నేపథ్యంలో నవంబర్ నెలలో మూడు విడుదలగా ఎన్నికల నిర్వహించింది ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలోని పరకాల డివిజన్లో ని వివిధ మండలాలలోనీ గ్రామాలలో నూతన సర్పంచుల ప్రమాణస్వీకారంతో కొత్తపాలకవర్గాలు కొలువుదీరాయి. దీంతో పంచాయతీలలో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా సర్పంచులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో పేరుకుపోయిన పారిశుద్ధ సమస్యతో పాటు ప్రధానమైన మంచినీటి సమస్య గ్రామంలో అంతర్గత రోడ్లు మురుగునీటి కాలువలపై పాలకవర్గం ఒక కన్నేసి పనులను చకచకా నడిపించాలని కోరుతున్నారు.



# ఏం బతుకు రా.. మనిషి బతుకు. !

అమ్మ కడుపులో ఉన్నప్పుడే...
నాకో మతాన్ని అంటగట్టారు...
బయటపడ్డానో లేదో ఓ కులాన్ని అంటగట్టారు...
ఏం పాపం చేశామో తెలియదు కానీ, పాఠశాలలో వేస్తే
నీ కులం ఏందిరా అని ప్రశ్నించే సమాజంలోకి నన్ను తోసేశారు....
పెరిగి పెద్దయి సమాజంలో "నేను" అని చెప్పుకోవాలంటే ఫలానా
కులం వాడిని లేదా మతం వాడిని అని చెప్పే అంత దౌర్భాగ్యస్థితికి
నన్ను నెట్టేశారు కదరా...
కాలం తీరాక కన్నుమూస్తే కులానికో స్మశానవాటికలు..
భూతల్లిని సైతం వదలని కులాల కుటిల సంప్రదాయాలు...
మతానికో ఆచారాలు స్మశానంలోకి వెళ్లేటప్పుడు కూడా ఎన్నో కట్టు
బాట్లు నియమనిబంధనలు.. మనిషి బ్రతుకు..
చి మనిషిగా పుట్టాలంటేనే సిగ్గనిపిస్తుంది...
ఏం బతుకు రా నాయన... అమ్మ కడుపులో ఉన్నప్పటి నుంచి తిరిగి
కన్ను మూసి మట్టి కప్పబడే వరకు ఎంత ఆచార గోచారాలు వ్య
వహార సాంప్రదాయాలు, కట్టుబాట్లు... చి ఎవ్వన్నీ విడిచిపెట్టలే
అందరిని అధోగతి పాలు చేశాయి.... చి చి మనిషి జన్మ ఏం బతుకు
రా నాయన.. అనిపించేలా ఉంది మనిషి జీవితం...



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

# ముడుపులు అందితే ఒకే.. లేకుంటే కూల్చుడే..?

- బోడుప్పల్ ఆర్ఐ తీరుపై సర్వత్రా విమర్శలు...
- ప్రభుత్వ భూముల పర్యవేక్షణలో సవతి తల్లి ప్రేమ ఎందుకో.....!!

**జయభేరి, మేడిపల్లి :**

ప్రభుత్వ భూముల గజం కూడా కబ్జా కాకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన మండల స్థాయి అధికారుల తీరులో ఏలాంటి మార్పు రావాడం లేదు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 63/1 లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జా దారులు బోగస్ పత్రాలను సృష్టించి ఏలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలం అవుతున్నారు.ముఖ్యంగా దేవేందర్ నగర్ ఫేజ్ 2 లో ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి తన ధన బలంతో అధికారులను మభ్యపెట్టి రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణం చేపట్టాడు. దానిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు మీన వషాలు వేస్తుండడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి.






**ముడుపులు మూడితే ఒకే...**

ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న నిర్మాణాల విషయంలో అధికారులు పాత్ర చాలా ఉందని తెలుస్తుంది. నిర్మాణ దారులు ఇంటి నిర్మాణం చేపట్టిన సమయంలో రెవెన్యూ అర్ఐ తో సంప్రదింపులు జరిపి ముడుపులు తీసుకుని కబ్జా దారులకు సహకరిస్తున్నారనేది అందరికి తెలిసిన బహిరంగ రహస్యం.అదే స్థలంలో ఎవరైనా పేదలు ఇంటి నిర్మాణం చేపడితే రెవెన్యూ అధికారులకు అమ్యామ్యాలు అందించక పోతే మాత్రం వారిపై స్వైర విహారం చేస్తూ కూల్చివేతలు చేపడుతున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. బోడుప్పల్ ఆర్ఐ తీరుపై సర్వత్రా విమర్శలు... ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆర్ఐకి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే నాకు ముందే తెలుసు... మీరు చెపితే నేను వినాలా......గతంలో చాలామంది పిర్యాదు చేశారు.నాకు టైం లేదు,వారు కట్టుకుంటే మీకు ఏమి అవసరం.మేము చూసుకుంటామని అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం: డివి-ఎస్ఎస్ కృష్ణ, మేడిపల్లి తహసీల్దార్**

మేడిపల్లి మండలంలోని ప్రభుత్వ భూములలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరిగిన ఉపేక్షించేది లేదని,అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.



# నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

- భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా|| బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, కాప్రా :**

తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ, కుషాయిగూడ డిపో SC&ST ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ 8వ వార్షికోత్సవం వేడుకల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొని క్యాలెండర్ ను మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ పుట్టినరోజు వారంగా పిలువబడే ప్రతి మంగళవారం రోజున ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తున్న ఈ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, అసోసియేషన్ సభ్యులను సన్మానించారు కుషాయిగూడ డిపో SC&ST వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లూరి అంజయ్య. కార్యక్రమంలో TGSRTC ఆల్ డిపో SC&ST ఎంప్లాయిస్ సభ్యులు, ECIL & NFC SC&ST ఎంప్లాయిస్, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 113 మందికి కల్యాణ లక్ష్మి మరియు షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయల తో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో MRO పూల్ సింగ్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, శాంతి సాయి జెన్ శేఖర్, ప్రభుదాస్, బండారు శ్రీవాణి వెంకట్ రావు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలోని రాజకీయ ఫ్లెక్సీలు సరికాదు



**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 23:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ పరిధిలోని రాజకీయ నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు సరికాదని, కాంగ్రెస్ నేతలు అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ విమర్శించారు. కొండ కింద దేవస్థానం పరిధిలోని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలయ ఈవో వెంకట్రావును బీజేపీ పార్టీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ కొండ కింద సింహ ద్వారం దగ్గర ఎలాంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దు అని గతంలో అన్ని పార్టీల అధ్యక్షులకు ఈవో నోటీసులు ఇచ్చారని, కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం భారీ ఎత్తున గోపురానికి అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలను కించ పరిచే విధంగా ప్రవర్తించారన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కాదని, ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి పార్టీ నేతలు గుంటిపల్లి సత్యం, చంద్రమౌళి, మందోజు నరేష్, ఆలేటి కర్ణ, సురేష్, సత్యనారాయణ, లెంకలపల్లి శ్రీను, రాజీ రెడ్డి, అజయ్, వంశీ, ప్రవీణ్, సాయి, నవీన్, నిఖిల్, మల్లేష్, శ్యామ్, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.2.10 కోట్లు



**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 23:**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయం రూ.2,10,04,942 వచ్చినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. మంగళవారం కొండ కింద గల వ్రత మండపంలో స్వామివారి 29 రోజుల స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 75 గ్రాముల బంగారం, ఐదు కిలోల 600 గ్రాముల వెండిని భక్తులు హుండీలో సమర్పించినట్లు తెలిపారు. అమెరికా 844 డాలర్లు, ఇంగ్లాండ్ 45 పౌండ్స్, కెనడా 50 డాలర్స్, దిరామ్స్ 265, నేపాల్ 30, ఆస్ట్రేలియ 5, థాయ్ బాట్ 450, యూరోప్ 160, సింగపూర్ 79, రియల్ 16, బైసా 300, ఒమన్ 1ను భక్తులు హుండీలో సమర్పించినట్లు తెలిపారు.

# బంగ్లాదేశీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




జయభేరి, దేవరకొండ :

బంగ్లాదేశ్ లో ప్రతినిత్యం హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ నుండి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ ఎదుట బంగ్లాదేశీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి జూకురి సంపత్ వర్మ మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై నిత్యం దాడులు చేస్తూ వారిని బలవంతంగా మతమార్పిడి చేస్తూ ,అక్కడి మెజారిటీ ముస్లింలు నిత్యం మారణకాండ సృష్టిస్తున్నారని అన్నారు. బంగ్లాదేశ్ దేశ దేశవ్యాప్తంగా హిందువులపై ప్రతినిత్యం దాడులు చేస్తున్న అక్కడి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.

కేవలం మతం ఆధారంగా ఏర్పడిన బంగ్లాదేశ్ లో ముస్లింలు మారణకాండను సృష్టిస్తున్న మన దేశంలోని ఏ రాజకీయ పార్టీ నాయకులు కనీసం ఇట్టి వ్యవహారాన్ని ఖండించే సాహసం చేయడం లేదని, మైనారిటీలకు కాలిలో ముళ్ళు విరిగిన ఏడ్చి గగ్గోలు పెట్టే మానవతావాదులు, సెక్యులర్ వాదులు, బంగ్లాదేశ్లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై నిత్యం దాడులు జరుగుతున్న కనీసం నోరు మెదపడం లేదని ఆయన అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఇట్టి వ్యవహారం పై చర్యలు చేపట్టి అక్కడి మైనారిటీ హిందువులకు రక్షణ కల్పించాలని అన్నారు. బంగ్లాదేశ్ నుండి ఇతర దేశాల నుండి ఇక్కడికి అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యాలకు ముస్లింలకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్న రాజకీయ పార్టీలు బంగ్లాదేశ్ లోని మైనారిటీ హిందువుల గురించి కనీసం మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయ గౌరవాధ్యక్షులు చిలువేరు చంద్రమౌళి గురు స్వామి విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటోజు రామకృష్ణ ,జిల్లా సహాయ కార్యదర్శి ముంత రామ కృష్ణ, నగర ఉపాధ్యక్షులు నీలా సంజీవ గండూరి లక్ష్మణ్,బజరంగ్దళ్ నగర అధ్యక్షులు ఐతరాజు శ్యామ్ హిందూ సంఘాల నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలి

జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 23:

గొర్ల, మేకల కాపర్లు నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం మల్కాపురం, కొండాపురం, దత్తాయపల్లి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు గ్రామాల్లో 3075 గొర్రెలకు మేకలకు మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం కోరారు. ఈ మందుల ద్వారా గొర్రెలలో మేకలలో అంతపరమైన జీవులు నశించి, ఆరోగ్యపరంగా మారి పునరుత్పత్తి సామర్థ్యం, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సొన్నాయిల రఘు ,శివరాత్రి లావణ్య జహంగీర్, కరుణాకర్ ,పాల సంఘం చైర్మన్ ఆకుల బాలయ్య, డాక్టర్ రామారావు, పశు వైద్య సిబ్బంది శేఖర్, రాఘవేందర్, శంషాద్దీన్, హర్ష, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# సైన్స్ ఫెయిర్ లో మోడల్ స్కూల్ విద్యార్థుల హవా



జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 23 :

వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ లో తుర్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు రెండు ప్రదర్శనలు ఇన్స్పైర్ అవార్డులు రాష్ట్రస్థాయికి ఒక ప్రాజెక్టు సెలెక్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి తెలిపారు. స్టేట్ లెవెల్ కి సెలెక్ట్ అయిన విద్యార్థులు పి నవ్య శ్రీ 8వ తరగతి, పి ప్రణీత 6వ తరగతి, కోట ప్రవళిక ఇంటర్మీడియట్ ఫస్టియర్ టీచర్ ఎగ్జిట్ లో కోట నవీన్ కుమార్ జిల్లాస్థాయిలో బహుమతి లభించింది. ఈ ప్రాజెక్టులన్నిటికీ గైడ్ టీచరుగా కోట నవీన్ కుమార్ సారథ్యంలో అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో సెలెక్ట్ అయినటువంటి విద్యార్థులకు, గైడ్ టీచర్కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. రాబోవు కాలంలో మరిన్ని అవార్డులు సాధించి మోడల్ స్కూలుకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఎస్ హెచ్ వి ఆర్ రాష్ట్రస్థాయికి ఎంపికైన వీరారెడ్డిపల్లి పాఠశాల



జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 23:

తుర్కపల్లి మండలం వీరారెడ్డి పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వేచ్ఛ విద్యాలయ స్టార్ రేటింగ్ లో రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అభినందన పురస్కారాన్ని జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ఏడి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గీత, శ్రీనివాస్, బిక్కంసాహెబ్ ,జరీనా భాను బేగం, కచ్చి గళ్ళ మల్లయ్య, వసంత, విజయకుమార్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మల్లికార్జున స్వామి దేవాలయ తోరణ ద్వారం నిర్మాణం

- దాతలు ఆవుల భారతమ్మ రాములు సహకారంతో ఎలికట్ట మల్లికార్జున స్వామి ద్వారం నిర్మాణం



జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 23 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ద్వారమును దంపతులు ఆవుల భారతమ్మ రాములు తమ నిధులతో నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా ఆవుల భారతమ్మ రాములు మాట్లాడుతూ; దైవభక్తిలో ముందు ఉంటామని అన్నారు. ఆ భగవంతుని ఆశీస్సులు ప్రజల అందరికీ ఉండాలని ఈ సృష్టిలో భగవంతుడు ఆజ్ఞ లేనిది ఏ జీవి లేదు అని దైవాన్ని ధర్మాన్ని రక్షించి మనుషులు దైవభక్తితో కలకాలం సుఖసంతోషాలతో విరసిల్లాలని అన్నారు. ఏ అభివృద్ధి పని చేసిన మనసుకు ఎంతో సంతోషకరంగా అనిపిస్తుందని దైవభక్తితో భక్తిశ్రద్ధలతో ఈ నిర్మాణాన్ని చేపట్టినందుకు చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. నూతన ద్వారాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా గ్రామ ప్రజలు తదితరులు అభినందనలు తెలిపారు.



# కనబడుటలేదు

జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్లెగొండ్ల రాజు (38), వృత్తి ఆటో డ్రైవర్, నివాసం విహారికా కాలనీ, రోడ్ నెంబర్ 8, మేడిపల్లి తెలియజేసినది ఏమనగా.. తన తండ్రి అయినటువంటి ఉల్లెగొండ్ల బక్కయ్య(85), తండ్రి ఎల్లయ్య, తన యొక్క సొంత గ్రామం అచ్చంపేట నుండి 17.12.2025 నాడు తన ఇంటికి వచ్చి తేదీ 18.12.2025 నాడు రాత్రి 8:30 సమయంలో వాకింగ్ కి బయటికి వెళ్తున్నాను అని చెప్పి మరల ఇంటికి తిరిగి రాలేదు. ఇట్టి విషయాన్ని మేడిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.

# కేటీఆర్ ను సన్మానించిన బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు




జయభేరి, దేవరకొండ :

నల్గొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ లో గెలుపొందిన సర్పంచుల సన్మాన సమావేశంకు విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గులాబీ శాలువతో సత్కరించారు.

# సర్పంచ్ రమావత్ మోహన్ లాల్ ను సన్మానించిన కేటీఆర్

జయభేరి, దేవరకొండ :

నల్గొండలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండలం శత్రు తండా నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ రామావత్ మోహన్ లాల్ ను శాలువాలతో సన్మానం చేసినారు.

# గిరిజన మహిళా డిగ్రీ కళాశాల లో సెమీ క్రిస్మస్ వేడుకలు



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండ లో డిసెంబర్ 23న సెమీ క్రిస్మస్ వేడుకలు పరమత సమ్మేళనం సాంప్రదాయ విలువలు పిల్లలు నేర్చుకోవాలని విజయవంతంగా ఈ కార్యక్రమం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# బెదిరిస్తే.. బెదరవద్దు

- పంచాయతీ పాలకవర్గాలకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచన
- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు



జయభేరి, యాదగిరిగుట్ట:

గ్రామ పంచాయతీలకు ఎవరి దయాదాక్షిణ్యాలతో నిధులు రావని.. చట్టబద్ధంగా 85 శాతం నిధులు వస్తాయని... గ్రామ పంచాయతీ పాలకవర్గాలు కూర్చొని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకుని, తీర్మానాలు చేసుకొని ముందుకు సాగాలే తప్ప...నిధులు రావని ఎవరో బెదిరిస్తే బెదరవద్దని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన శ్రీ లక్ష్మి స్వామివారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. అమలుకు నోచుకోని హామీలతో మోసపు మాటలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గతంలో గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ,జడ్పిటిసి తదితర అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ నూటికి నూరు శాతం గెలుచుకుందని ఆయన గుర్తు చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని వందకు పైగా పంచాయతీలను గెలుచుకుందన్నారు.

తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ పట్ల గ్రామాలలో ఇప్పటికీ అభిమానం చెక్కుచెదరలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ బిఆర్ఎస్ దే అధికారం అని అన్నారు. బడ్జెట్ నిధులు రావని ఎవరైనా బెదిరిస్తే బెదరకూడదని అన్నారు. యాదగిరి కొండ దిగువన ఫ్లెక్సీల నిషేధంపై ఆయన మాట్లాడుతూ నిబంధనలు అందరికీ సమానంగా వర్తింపజేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో జనరల్ సీట్లలో కూడా బీసీలు పోటీ చేసి విజయం సాధించారని.. బీసీ వర్గాల్లో చైతన్యం వచ్చిందన్నారు. భారతదేశంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. అంతకు ముందు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు బిఆర్ఎస్ పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య,బహుపేట గ్రామ సర్పంచ్ కవిడె మహేందర్, బిఆర్ఎస్ పార్టీ నేతలు పాపట్ల నరహరి, ఆవుల సాయి,పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్, ఆకుల శ్రీనివాస్, ముక్కెర్ల సతీష్యాదవ్, వీరేశం,గడ్డం చంద్రంగౌడ్, భక్త కన్నప్ప,పబ్బాల సాయి, సతీష్భట్ తదితరులు పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మారేపల్లి

- సెయింట్ క్లారెట్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు
- క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం




జయభేరి, మేడ్చల్ :

విద్యార్థులు నిబద్ధతతో చదివి క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిహెచ్ఎంసి గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం గుండ్ల పోచంపల్లి డివిజన్ లోని బాసురెగడి ప్రాంతంలో ఉన్న సెయింట్ క్లారెట్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మారేపల్లి సుధాకర్ క్రీడ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో కలిసి ప్రధానం అందజేశారు. ఈ సందర్భంగా మారేపల్లి సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలోనూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తోడ్పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఫాదర్ జేమ్స్ బెన్ని, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలి




జయభేరి, దేవరకొండ :

బాలల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ కోరారు. మంగళవారం పట్టణ స్థాయి బాలల పరిరక్షణ సమితి సమావేశము మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో బాలల పైన జరుగుతున్నటువంటి అకృత్యాలు ఆరు రకాలుగా ఉన్నాయని అందులో మొదటిది బాల్య వివాహాలని, పిల్లలను అమ్మడము, దత్తత ఇవ్వడం వంటివి ఉన్నాయన్నారు. పిల్లలు గంజాయి ,సిగిరెట్, డ్రగ్స్ వంటి విషపూరితమైన పదార్థాలు సేకరించడం వంటివి ఉన్నాయని, వీటన్నిటిమీద పిల్లలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదన్నారు. అందుకోసము బాలల పరిరక్షణ సమితి విశిష్టంగా పని చేయాలన్నారు . అందులో భాగంగా మున్సిపాలిటీ లోని వార్డ్ కౌన్సిలర్లు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా చైర్మన్ గా వ్యవహరించాలని అన్నారు. మున్సి పల్ కౌన్సిలర్లు లేరు కాబట్టి వార్డ్ ఆఫీసర్లు విధిగా చైర్మన్ గా వ్యవహరించాలన్నారు. దేవరకొండ పట్టణ పరిధిలో నిరక్షరాస్యత, అవగాహన లేమి వలన బాల్య వివాహాలు ఎక్కువగా ఉన్నాయని, వారి చదువు తక్కువగా ఉంటుందని ఇటువంటి వాటిని మనము అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి చైర్మన్ చింతా కృష్ణ, డీసీపీవో గణేషు, సీడీపీఓ చంద్రకళ, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ బి. రాజు, ఎల్ సి పి ఓ వెంకన్న, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, డి సి పి యు అంజలి, మెప్మా టి ఎం సి జగమంతు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి వెళ్లకపోతే రేవంత్‌కు కేసీఆర్ చిక్కినట్లే..

# చిచ్చు రాజేసింది కేసీఆరే..

- బహిరంగసభలు పెట్టగలరా?. అసెంబ్లీకి సరిపోతాయా?

జయభేరి, హైదరాబాద్ :



పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం, డీపీఆర్ వెనక్కి, 40 టీఎంసీల లేఖ..ఇలా చాలా అంశాలను కేసీఆర్ రాజకీయ అంశాలుగా మార్చారు. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీపై వేసిన రాళ్లే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాటిని ఎదుర్కోవడానికి రెడీ అయింది. ఆయనకు కౌంటర్ గా పెట్టిన ప్రెస్‌మీట్‌లు, చిట్‌చాట్‌లు అన్నీ రాజకీయం. కానీ అసెంబ్లీలో చర్చించి. అసలు తప్పెవరిదో తేల్చడం మాత్రం. ప్రజలతో ముడిపడిన రాజకీయం. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఇదే అంశంపై సవాల్ చేశారు. జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడుతున్నారు. కేసీఆర్ వచ్చి చెప్పుకోవాల్సింది చెప్పుకోవచ్చని సవాల్ చేశారు. కేసీఆర్ వచ్చినా రాకపోయినా రేవంత్ తన గేమ్ ఆడతారు. బీఆర్ఎస్ నేతలు బయట ఎన్ని కబుర్లు చెప్పినా అవి వ్యాలిడ్ అయ్యే అవకాశాలు ఉండవు.

**చిచ్చు రాజేసింది కేసీఆరే..**

నీళ్లను నిప్పులుగా మార్చి రాజకీయంగా పండగ చేసుకుందామని కేసీఆర్ రెండేళ్ల తర్వాత తన పాత ఆయుధంతో బరిలోకి వచ్చారు. ఆయన ఇప్పుడు దాన్ని పట్టుకుని నిలబడి కొట్లాడాల్సిందే. ఎందుకంటే ఆయన చిచ్చు పెట్టేశారు. ఇప్పుడు దానికి ఎవరు కారణం..ఎవరి వల్ల నష్టం, ఎవరు నిర్లక్ష్యం చేశారు అన్నది రెండు పార్టీలు తేల్చుకోవాలి. ఇంకా చెప్పాలంటే కేసీఆర్, రేవంతే తేల్చుకోవాలి. ఇప్పుడు కేసీఆర్ తాను చెప్పాలనుకున్నది మైక్ ముందు మాత్రమే చెబుతాను. అసెంబ్లీకి మాత్రం రాను అంటే ప్రజలు కూడా వ్యతిరేకంగా స్పందిస్తారు. ఎందుకంటే ఈ అంశంపై ఆరోపణలు చేసింది కేసీఆర్. వాటిని అసెంబ్లీలో ప్రజల ముందు పెట్టాల్సింది కూడా ఆయనే. నిజమని నిరూపించాల్సింది కూడా ఆయనే..

**అసెంబ్లీకి రాకపోతే రేవంత్ కు అడ్వాంటేజ్!**

కేసీఆర్ అసెంబ్లీకి హాజరుపై స్పష్టత లేదు. ప్రెస్మీట్ తర్వాత ఓ జర్నలిస్టు అసెంబ్లీకి వెళ్తారా అని అడిగితే.. ధ్యాంక్యూ అని చెప్పి వెళ్లిపోయారు. నిజంగా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎదుర్కొంటా తోలు వలుస్తా అని ఆయన చెప్పినట్లయితే ఓ రేంజ్ పోరాటాన్ని అందరూ ఎక్స్ పెక్ట్ చేసేవారు. కానీ అసెంబ్లీకి వచ్చేందుకు ఆయన సుముఖంగా లేరని మాత్రం ఆ ఎక్స్ ప్రెషన్ తో అర్థమైపోతుంది. నిజంగా ఆయన అసెంబ్లీకి రాకపోతే రేవంత్ రెడ్డి వన్ సైడ్ బ్యాటింగ్ చేస్తారు. కేటీఆర్, హరీష్ సభలో ఉన్నప్పటికీ..కేసీఆర్ ప్రతిపక్ష నేత. పదేళ్లు సీఎంగా ఉన్నారు. ఆయన చెబితేనే విలువ ఉంటుంది. లేకపోతే రేవంత్ చెప్పే మాటలే ప్రజల్లోకి వెళ్తున్నాయి. సోషల్ మీడియాలో,బయట ఎంత ప్రచారం చేసుకున్నా అవేమీ వ్యాలీడ్ అవ్వవు.

**బహిరంగసభలు పెట్టగలరా?**

**అసెంబ్లీకి సరిపోతాయా?**

పదిహేను రోజుల్లో మూడూ బహిరంగసభలు పెడతానని కేసీఆర్ ప్రకటించారు. తాను కూడా వెళ్తానన్నారు. అదే సమయంలో అసెంబ్లీ జరుగుతుంది. కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లకుండా, అసెంబ్లీలో రేవంత్ మాట్లాడేదానికి బహిరంగసభల్లో కౌంటర్ ఇస్తానని చెప్పడం చట్టసభల్ని అవమానించడమే అవుతుంది. అంటే ప్రజల్ని అవమానించడమే అవుతుంది. బహిరంగసభల్లోఏం మాట్లాడినా ప్రజలు దాన్ని ఎదురుదాడిగానే చూస్తారు కానీ చట్టబద్ధంగా చూడరు. అందుకే కేసీఆర్ అసెంబ్లీకి హాజరవడం వల్లనే బీఆర్ఎస్ పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. లేకపోతే రేవంత్ రెడ్డి..కేసీఆర్ విసిరిన వాటర్ బాల్‌ను సిక్సర్ కొట్టి మరోసారి విన్నర్‌గా నిలుస్తారు.

# కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ పథకం
- గొర్రెలు,మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి
- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్

జయభేరి, చింతపల్లి :



కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు.మంగళవారం చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ......గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన కోరారు.పశు సంపద అభివృద్ధితో పాటు గొర్రెల పెంపకదారుల జీవితాలలో కేసీఆర్ ప్రభుత్వం వెలుగులు నింపిదని ఆమె అన్నారు.స్వయం ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్,గంటెల అలివేలు సోమయ్య,దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,ధరణిపతి రమణారావు,మర్ల యాదయ్య,శివర్ల పర్వతాలు యాదవ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,సిమర్ల శ్రీను యాదవ్,కాయితి బచ్చిరెడ్డి,దాసరి ముత్తయ్య, రాశిక మల్లయ్య,జక్కుల వెంకటయ్య,మెరిక శంకర్,ఉడుత శంకరయ్య,కొన్రెడ్డి రామకృష్ణ,గ్రామ పెద్దలు దాసరి ముత్తయ్య,శిరుసవాడ చల్మయ్య,వెటర్నరి అసిస్టెంట్ (LSA) రాహుల్ , గోపాల మిత్ర మెరిక శంకరయ్య,పశువైద్య సిబ్బంది గణేష్, తదితరులు పాల్గొన్నారు.



# మైనర్ బాలికపై అత్యాచారం

- నిందితుడూ మైనరే

జయభేరి, పామర్రు:

మొవ్వ (మ) పెదసనగల్లు గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. ఐదు సంవత్సరాల మైనర్ బాలికని బలవంతంగా 13 సంవత్సరాలు మైనర్ బాలుడు అత్యాచారం చేసాడు. సోమవారం సాయంత్రం సమయంలో కేక్ ఇస్తాను అని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడి చేసాడు. మంగళవారం ఉదయం పాప నొప్పిగా ఉందని ఏడుస్తూ ఉండడంతో తల్లిదండ్రులు గమనించారు. కూచిపూడి హాస్పిటల్ కు తీసుకెళ్లి చూపించగా చికిత్స చేసిన వైద్యుడికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సదరు సమాచారం ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కలెక్టరేట్ లో నారి న్యాయ్ కార్యక్రమం

- పాల్గోన్న మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శారద

జయభేరి, హైదరాబాద్:

హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో "నారి న్యాయ్" కార్యక్రమం నిర్వహించారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద ఆధ్వర్యంలో నారి న్యాయ్" కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ రకాల కేసులకు పరిష్కరించడానికి ఈ కార్యక్రమంలో సంబంధించిన అధికారులు అందరూ పాల్గొన్నారు. ఇంతకుముందు నమోదైన కేసులతోపాటు, వాకింగ్ కేసులకు సంబంధించిన వారు కూడా హాజరయ్యారు. మహిళల యొక్క ఆవేదన వారికి కావలసిన న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వారి యొక్క సమస్యలను పరిష్కరించే దిశలో వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ శారద.మహిళల సమస్యలు, పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల గురించి నేరుగా పిటిషనర్ల నుండి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను వివిధ పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా వెరిఫై చేసి రిపోర్టు రేపు మహిళా కమిషన్ కు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎక్కువ శాతం విడాకుల కేసులు ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,మహిళా కమిషన్ కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా డి.డబ్ల్యూ.ఓ, సిడిపిఓలు, ఎస్.హెచ్.ఓ లు... వివిధ డిపార్ట్ మెంట్ ల అధికారులు పాల్గొన్నారు.

# సాయి గీత ఆశ్రమంలో భక్తి శ్రద్ధలతో శ్రీ చండి హోమం

- హోమాలు చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు కలుగును :-సద్గురు శ్రీ సాయి కుమార్ బాబ

జయభేరి, మేడ్చల్:



మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా కండ్లకోయలో ఉన్న సాయి గీతా ఆశ్రమం, డిసెంబర్ 22, 2025 నుంచి డిసెంబర్ 28, 2025 వరకు వార్షిక ఆధ్యాత్మిక ఉత్సవమైన సర్వ దోష నివారణ మహా యజ్ఞంను ఘనంగా నిర్వహించనుంది.ఈ సందర్భంగా, ఏడు రోజుల పాటు ఏడు విభిన్న హోమాలు నిర్వహించబడతాయి. ఈ సప్తాహ హోమాలు ధార్మిక కోరికల నెరవేర్పు, జీవితంలోని సవాళ్లను అధిగమించడం, మంచి ఆరోగ్యం మరియు దీర్ఘాయుష్షును ప్రసాదించడం, అలాగే భక్తులకు అనేక ఆధ్యాత్మిక మరియు లౌకిక లాభాలను కలిగించేందుకు నిర్వహించబడతాయి.అందులో భాగంగా మంగళవారం చండీ హోమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఈ హోమాలలో పాల్గొని దైవ ఆశీర్వాదాలు పొందనున్నారు. చివరి రోజున, సర్వ దోష నివారణ మహా యజ్ఞం మహా వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు సామూహిక కొబ్బరికాయ కొట్టే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మహత్తర ఆచారం సర్వలోక క్షేమం, ప్రపంచ శాంతి, మరియు పంచభూతాల సౌహార్దానికి అంకితమైంది.. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని సార్వత్రిక శ్రేయస్సు మరియు సామూహిక సమృద్ధికి కారణమవాలని సద్గురు శ్రీ సాయి కుమార్జీ కోరారు.



# రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

జయభేరి, నల్లగొండ, డిసెంబర్ 23 :

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో జరిగిన సర్పంచులు, వార్డ్ మెంబర్‌ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. నామినేటెడ్ పద్ధతిపై ఆయన ధ్వజమెత్తారు.ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూసి భయంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంలేదని, నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేస్తూ కాలక్షేపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు.రైతు బంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే.. రైతులకు మంచి చేశామన్న నమ్మకం ఉంటే.. సహకార ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు.ఎన్నికల నుంచి కాంగ్రెస్ ఎన్ని రోజులు తప్పించుకున్నా, ప్రజా క్షేత్రంలో ఆ పార్టీని నిలదీయడం ఖాయమని కేటీఆర్ స్పష్టంచేశారు.

# పివీకి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



జయభేరి, హైదరాబాద్:

భారత రత్నా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 21 వ వర్ధంతి సందర్భంగా పీవీ జ్ఞానభూమి వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్,పీవీ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ ,ఇతర ముఖ్య నేతలు నివాళులు అర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బహుభాషా కోవిదుడు ఆర్థిక సంస్కరణల వేత్త. ఆర్థిక అంశాల్లో భారతదేశం ఈరోజు నిలబడింది అంటే ఆయన చేసిన సంస్కరణలు నిదర్శనం. తెలంగాణ ముద్దు బిడ్డ మా హుస్నాబాద్ నియోజకవర్గ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావు కి ఘన నివాళులు అర్పిస్తున్న. అయన చూపిన మార్గంలో వారి సంస్కరణలతో ప్రపంచ మాంద్యం వచ్చిన ,కరోనా లాంటి విపత్తు వచ్చిన దేశం బయటపడి స్వయంగా నిలదొక్కుకుని నిలబడింది అంటే ఆయన సంస్కరణలు స్ఫూర్తి. ఒక గ్రామీణ ప్రాంతంలో జన్మించి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా స్వయం కృషి తో నాయకత్వాన్ని ఒప్పించి మెప్పించి దేశ వ్యాప్తంగా గొప్ప నాయకుడిగా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రధాన మంత్రి వరకు ఎదిగిన వ్యక్తి.. మెజారిటీ ప్రభుత్వం కానప్పటికీ 5 సంవత్సరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నడిపిన పీవీ నరసింహారావు గారిని కొనియాడుతున్ననని అన్నారు.

రాజకీయాల్లో కేంద్రంలో బీజేపీ పార్టీ చరిత్రను మరిచివేసే విధంగా జవహర్ లాల్ నెహ్రూ ,మహాత్మా గాంధీ లాంటి జాతిపిత ల పేరు చరిత్రలో లేకుండా చేసే ప్రయత్నం జరుగుతుంది..రాజకీయంగా లబ్ధి పొందాలని వల్లబ్ బాయ్ పటేల్, పీవీ నరసింహారావు లాంటి వారు పుట్టుక నుండి మరణం వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన వారిని బీజేపీ రాజకీయంగా వాడుకోవాలని చూస్తుందని అన్నారు. జీవించి ఉన్నప్పుడు చేసే రాజకీయాలు వేరు మరణించిన తర్వాత బీజేపీ ఇలాంటి రాజకీయాలు తగదు. పీవీ నరసింహారావు విధానాలు వారు చూపిన మార్గదర్శకత్వాన్ని ముందుకు తీసుకోవాలి. పీవీ నరసింహారావుకు ఘన నివాళులు అర్పిస్తున్ననని అన్నారు.

# విద్యార్థులతో విద్యార్థిని కొట్టించిన టీచర్లు

జయభేరి, కుత్బుల్లాపూర్:

ఏడో తరగతి విద్యార్థిపై అదే స్కూల్లో చదువుతున్న విద్యార్థులతో దాడి చేయించిన సంఘటన పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శివరామకృష్ణ కుమారుడు సూర్య 7వ తరగతి చదువుతున్నాడు. అతన్ని విద్యార్థులు పార్కు చేసిన సైకిళ్ల వద్దకు వెళ్లి చూసి రమ్మని ఉపాధ్యాయుడు మధు చెప్పడంతో చూసొచ్చాడు. అయితే సూర్య సైకిళ్ల వద్దకు వెళ్లి వస్తున్నాడని మరో ఉపాధ్యాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, దుండిగల్ మండల ఎంఈవో కృష్ణ వద్దకు తీసుకెళ్లాడు. ఆయన ఆగ్రహించి 10వ తరగతి విద్యా ర్థులను పిలిచి బాలుడి వీపుపై కొట్టాలని ఆదేశించారు. దీంతో వారు రెచ్చిపోయి కర్రతో విపరీతంగా దాడి చేశారు. ఈ విషయం బయట చెబితే పాఠశాల నుంచి టీసీ ఇచ్చి పంపిస్తానని హెచ్ఎం బెదిరించాడు. దెబ్బలు తట్టుకోలేక సూర్య రాత్రి నీరసంగా ఉండటంతో తల్లిదం డ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ విషయమై పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కృష్ణను సంప్రదించగా తానే విద్యార్థులను పిలిపించి కొట్టుమని చెప్పా నని, కానీ అంత పెద్దగా కొడతారని అనుకోలేదని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చాడు.



# ఈ సారి విజయం పక్కా

'మన పురాణాల్లో 'శంబాల'కు ప్రాధాన్యత ఉంది. ఈ టైటిల్ వినగానే ఫ్లైట్ అయ్యాను. ఈ కథ విన్న కొన్ని రోజులకే 'కల్కి 2898ఏడీ' విడుదలైంది. ఆ తర్వాత 'శంబాల' పేరు మరింత ఎక్కువగా ట్రెండ్ అయ్యింది. నా కెరీర్‌లో ఇంత బజ్ వచ్చిన సినిమా ఇదే. ప్రచార చిత్రాలకే విపరీతమైన స్పందన కనిపిస్తుంది. ఈ సారి విజయం పక్కా అనే కాన్ఫిడెంట్‌తో ఉన్నాను.' అని హీరో ఆది సాయికుమార్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకుడు. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 25న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆది సాయికుమార్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'ఈ సినిమాకు యాక్షన్ సీక్వెన్సే హైలైట్. ఫైట్ కొరియోగ్రాఫర్ రాజ్‌కుమార్ రిహార్సిల్స్ చేయించి మరీ ఈ ఎపిసోడ్స్ తీశారు. దర్శకుడు యుగంధర్‌తోపాటు కలిసి ఆయన ట్రావెల్ చేశారు. ముఖ్యంగా క్లైమాక్స్ కన్నులకు విందులా ఉంటుంది. 80ల్లో కథ కాబట్టి ఆహార్యం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకున్నాం. ఇందులో వీఎఫ్ఎక్స్ ఎక్కువగా ఉండవ్. ఉన్నంతలో మాత్రం అద్భుతంగా వచ్చాయి. ఇందులో పాటలు కూడా ఉండవ్. ఆర్ఆర్ మాత్రం అదిరిపోతుంది. శ్రీచరణ్ పాకాల తన మ్యూజిక్‌తో సినిమాను మరో స్థాయిలో నిలబెట్టారు.' అని తెలిపారు ఆది సాయికుమార్. ఆడియన్స్‌కి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, నిర్మాతలు ఏ విషయంలోనూ రాజీ పడకుండా భారీ ఎత్తున సినిమాను నిర్మించారని, దర్శకుడు యుగంధర్ ముని పాషన్‌తో సినిమా తెరకెక్కించారని, సినిమా విషయం సంతృప్తిగా ఉన్నామని, త్వరలో హిందీలోనూ విడుదల చేస్తామని ఆది చెప్పారు.

## 'నీ నీతులు ఇంట్లోనే చెప్పుకో'.. శివాజీకి ఆర్జీవీ స్ట్రాంగ్ కౌంటర్



'దండోరా' సినిమా ఈవెంట్‌లో టాలీవుడ్ నటుడు శివాజీ మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో వివాదం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ సింగర్ చిన్మయి, అనసూయ, మంచు మనోజ్ అతడికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అయితే ఈ వివాదంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా స్పందిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.

"శివాజీ పూర్తి పేరు కూడా తనకు తెలియదని పేర్కొంటూనే అతడిని ఉద్దేశిస్తూ ఆర్జీవీ ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "హేయ్ శివాజీ.. నువ్వు ఎవరివైనా, ఎలాంటి వాడివైనా నాకు అనవసరం. నీలాంటి ఒక అసభ్యకరమైన పద్ధతి లేని వ్యక్తిని నీ ఇంట్లో ఆడవాళ్లు భరిస్తున్నారు కాబట్టి.. వెళ్లి నీ నీతులు వాళ్లకి చెప్పుకో. అంతేగాని సమాజంలో ఉన్న మహిళలపై గానీ, చిత్ర పరిశ్రమలో ఉండేవారిపై గానీ నీ చెత్త అభిప్రాయాలను రుద్దకు" అంటూ శివాజీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా.. ప్రస్తుతం ఆర్జీవీ చేసిన ఈ వ్యాఖ్యలు ఫిల్మ్ నగర్ వర్గాల్లో వైరల్ అవుతున్నాయి.



# టీనేజ్ లో చాలా కష్టాలు పడింది..


కెనడాలో జన్మించిన సన్నీ లియోన్ అసలు పేరు కరణ్ జిత్ కౌర్ వోహ్రా. కొన్నేళ్ల పాటు అమెరికాలో కూడా నివసించిందీ అందాల తార. ఈ నటికి కెనడాతో పాటు అమెరికన్ పౌరసత్వం కూడా ఉంది. 2011 లో వివాహం చేసుకున్న తర్వాత 2012 లో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది సన్నీ లియోన్. 'జిస్మ్ 2' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'రాగిణి ఎంఎంఎస్ 2', 'ఏక్ పహేలి లీలా', 'మస్తిజాదే' వంటి హిట్ చిత్రాల్లో నటించింది. 'లైలా మైన్ లైలా', 'బేబీ డాల్' 'పింక్ లిప్స్' వంటి స్పెషల్ సాంగ్స్ తో నేషనల్ వైడ్ క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక కరెంట్ తీగ, జిన్నా వంటి తెలుగు సినిమాల్లోనూ కీలక పాత్రలు పోషించింది. సన్నీ ఇప్పుడు వ్యాపారవేత్తగా కూడా బాగా ఫేమస్. 2018లో ఆమె కాస్మెటిక్ బ్రాండ్ స్టార్ స్ట్రక్‌ను ప్రారంభించింది. 2021లో పెటా ఆమోదించిన వీగన్ అథ్లెటిక్ బ్రాండ్‌లో కూడా ఇన్వెస్టె మెంట్స్ పెట్టింది. సన్నీ లియోన్ ఇప్పుడు కోట్ల ఆస్తులకు మహారాణి. సెలబ్రిటీ నెట్ వర్త్ నివేదిక ప్రకారం, ఆమె మొత్తం ఆస్తులు దాదాపు రూ. 115 కోట్లు. ఆమెకు ముంబైతో పాటు అమెరికాలో కూడా విలాసవంతమైన బంగ్లాలు ఉన్నాయి. అలాగే మసెరటి గిబ్లి నెరిస్సిమో, మసెరటి క్వాట్రోపోర్టే, BMW 7 సిరీస్ ఆడి A5 లగ్జరీ కార్లు కూడా ఉన్నాయి.



# వారి.. క్రేజీ కాంబో.. మెస్మెరైజ్..

దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో నాని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని 1980వ దశకంలో సికింద్రాబాద్ మురికివాడల నేపథ్యంలో సాగే రా అండ్ రస్టిక్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే దసరా సినిమాతో మాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్న నాని.. ఇప్పుడు మరోసారి ప్యారడైజ్ చిత్రంలోనూ మాస్ అవతారంలో కనిపించనున్నారు. ఈ మూవీని దాదాపు 8 భాషలలో విడుదల చేయాలని భావిస్తున్నారు మేకర్స్. ఇదెలా ఉంటే.. ఈ సినిమాను ఓ స్టార్ హీరో మిస్సైందని సో,ళ్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ముందుగా ఈ మూవీకి నాని సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ను ఎంపిక చేసిందిట చిత్రయూనిట్. కానీ అప్పటికే పలు సినిమాలను ఓకే చేయడంతో డేట్స్ అడ్జస్ట్ కాదని రిజెక్ట్ చేసిందట. ప్రస్తుతం జాన్వీ పెద్ది చిత్రంలో నటిస్తుంది. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు దేవర 2లోనూ కనిపించనుంది. అలాగే హిందీలో పలు ప్రాజెక్ట్స్ చేస్తున్నట్లు టాక్. అయితే ఇప్పుడు జాన్వీ తర్వాత ప్యారడైజ్ సినిమా కోసం కయాదు లోహర్ ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు' నుంచి అదిరిపోయే స్టిల్ రిలీజ్




### శరవేగంగా జరుగుతున్న పోస్ట్ ప్రొడక్షన్

మెగాస్టార్ చిరంజీవి మాస్‌అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంఅద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, అర్చన సమర్పిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్ తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే మీసాల పిల్ల, శశిరేఖ పాటలు చార్ట్‌బస్టర్ హిట్స్‌గా సంచలనం సృష్టించాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న చిరంజీవి, వెంకటేష్ పై చిత్రీకరించిన పాటని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ త్వరలోనే రాబోతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని, తమ్మిరాజు ఎడిటింగ్‌ను, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. కథను ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సంయుక్తంగా రాశారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. నటీనటులు: చిరంజీవి, వెంకటేష్, నయనతార, వీటీవీ గణేష్

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com